క్లుప్తంగా

దేశరాజు విగ్రహావిష్కరణ



దేశరాజు విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న ఇంద్రకుమార్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : స్థానిక సీఆర్ రెడ్డి విద్యా సంస్థల వ్యవస్థాపక ప్రిన్సిపాల్ దేశరాజు సత్య సుబ్రహ్మణ్యం విద్యా సంస్థల అభివృద్ధికి చేసిన సేవలు మరువరానివని సీఆర్‌ఆర్ విద్యా సంస్థల పాలక మండలి అధ్యక్షుడు అల్లూరి ఇంద్రకుమార్ అన్నారు. శనివారం స్థానిక సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాల ప్రాంగణంలో దేశరాజు సత్య సుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ప్రత్యేక అతిథిగా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు విచ్చేయగా ప్రిన్సిపాల్ కేపీ రామరాజు అధ్యక్షత వహించారు. సీఆర్‌ఆర్ విద్యా సంస్థల ఉపాధ్యక్షులు వీవీ బాలకృష్ణారావు, ఏవీ సుబ్రహ్మణం, సెక్రటరీ ఎంబీఎస్‌వీ ప్రసాద్, కొడాలి వెంకటసుబ్బారావు, వల్లభనేని శ్రీకృష్ణ, చిట్టూరి జానకి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పారా వలంటీర్లు కీలకంగా పనిచేయాలి



మాట్లాడుతున్న జడ్జి సునీల్ కుమార్

ఏలూరు (టూటౌన్) : పారా వలంటీర్లు బాధితులకు, న్యాయస్థానాలకు మధ్య వారధిగా పనిచేయాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్, 8వ అదనపు జిల్లా జడ్జి ఎం సునీల్ కుమార్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో శనివారం ఏలూరు పరిధిలోని పారా లీగల్ వలంటీర్ల నియామకం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ పారా వలంటీర్లు కక్షిదారులకు అవసరమైన న్యాయ సహాయాన్ని అందించడంలో కీలక పాత్ర వహించాలని అన్నారు. ఫలాపేక్ష లేకుండా ప్రజాసేవ చేయడానికి ముందుకు వచ్చినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, జడ్జి షేక్ మహమ్మద్ అబూతాలిబ్ పర్వీజ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉరుసు ఉత్సవాలు



పోస్టర్ విడుదల చేసిన ముజావర్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బపై ఉన్న హజరత్ సయ్యద్ బాయజీద్ మహాత్ముల దర్గాలో ఈ నెల 26 నుంచి మహాత్ముని ఉరుసు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని దర్గా వంశపారంపర్య ముజావర్లు షేక్ హుస్సేన్, షేక్ సాబీర్ హుస్సేన్, షేక్ సబ్బీర్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా ఉరుసు ఉత్సవాల వాల్‌పోస్టర్ విడుదల చేశారు. శనివారం స్థానిక దర్గాలో వారు విలేకర్లతో మాట్లాడారు. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం జెండా ఆవిష్కరణ, రాత్రి 10.30 గంటలకు గడియార స్తంభం ప్రాంతంలోని జీనత్ మంజిల్ నుంచి గంధం కలశ ఊరేగింపు ప్రారంభమై తెల్లవారు జాము వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో తిరిగి కోటదిబ్బ దర్గాకు చేరుకుంటుందని తెలిపారు. 27న తెల్లవారు జామున ఫజర్ నమాజు, ఉదయం ప్రధాన ఫతెహాఖానీ, సాయంత్రం దీపారాధన ఉంటుందని పేర్కొన్నారు. రాత్రి అమరావతికి చెందిన ఖవ్వాల్ సలీమ్ షహజాదా బృందం, నాగపూర్‌కు చెందిన ఖవ్వాలన్ కరిష్మా తాజ్ బృందం ఆధ్వర్యంలో ఖవ్వాలీ ఏర్పాటుచేశామని తెలిపారు. 28న ఉదయం దివ్య ఖుర్‌ఆన్ గ్రంథ పఠనంతో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

కొల్లేరు సమస్యపై 27న సమావేశం

దెందులూరు: కొల్లేరులో ఆక్రమిత చెరువుల తొలగింపు అంశంలో సుప్రీంకోర్టు ఆదేశాలపై ఈ నెల 27న ఏలూరు వసంత మహల్ సెంటర్‌ని జాబిల్లి ఫంక్షన్ హాల్లో మధ్యాహ్నం 3 గంటలకు కొల్లేరు ఎస్సీ గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేశామని చైర్మన్ రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి చాగంటి సంజీవ్, ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ లక్షలాది మంది కొల్లేరు ప్రజల జీవన విధానం భవిష్యత్తు భద్రత తీసుకోకుండా సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తామనడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

శానిటరీ వర్కర్లకు ఆర్థిక సమస్యలు

- జీతాలు, పీఎఫ్ బకాయిల పెండింగ్
- 250 కుటుంబాలకు ఇబ్బందులు
- కాంట్రాక్టర్ మారిపోతే బకాయిలు ఎవరు చెల్లిస్తారని ఆందోళన



ఏలూరు జీజీహెచ్ వద్ద ధర్నా చేస్తున్న శానిటరీ వర్కర్లు (ఫైల్)

ఏలూరు టౌన్ : ఏలూరు సర్వజన ఆసుపత్రి కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ శానిటరీ వర్కర్లు దైన్యస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. హాస్పిటల్‌లో పరిశుభ్రమైన వాతారణం కోసం నిత్యం శ్రమిస్తోన్న వారు కనీసం జీతాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఏలూరు జీజీహెచ్‌తోపాటు, జిల్లాలోని ప్రభుత్వ హాస్పిటల్స్‌లోని శానిటరీ సిబ్బందికీ నెలల తరబడి జీతాలు చెల్లించకపోవటంతో వారి కుటుంబాల పోషణ భారంగా మారింది. సుమారు 250 కుటుంబాలు జీతాలు లేక పీఎఫ్ బకాయిలు చెల్లించకపోవటంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

జీతాలు, పీఎఫ్ బకాయిల చెల్లింపులపై ఆందోళన

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో శానిటరీ సిబ్బందికి నెలల తరబడి వేతనాలు, 18 నెలలుగా పీఎఫ్ బకాయిలు చెల్లించకపోవటంతో ఆందోళన చెందుతున్నారు. పీఎఫ్ రుణాలు పొందేందుకు సైతం అవకాశం లేకుండా పీఎఫ్ బకాయిలు సిబ్బంది ఖాతాల్లో వేయకుండా కాంట్రాక్ట్ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. వేతనాలు సైతం 5 నెలలు నుంచి ఇవ్వలేదని, ఇప్పుడు రెండు నెలల జీతాలు వేస్తే తాము చేసిన అప్పులకే సరిపోతాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శానిటేషన్‌లో అంతా దోపిడీ!

ఏలూరు జీజీహెచ్ శానిటేషన్ సిబ్బందికి ఒక్కొక్కరికీ నెల వేతనం రూ.16 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తంలో ఈపీఎఫ్, ఈఎస్ఐ కట్ చేసుకుని వేతనాలు చెల్లిస్తారు. ఈపీఎఫ్‌లో కాంట్రాక్ట్ ఏజెన్సీ షేర్ రూ.13 కాగా, వర్కర్ వాటా రూ.12 ఉంటుంది. ఇక ఈఎస్ఐలో కాంట్రాక్ట్ ఏజెన్సీ షేర్ రూ.3.25ల ఉంటే వర్కర్ వాటా రూ.0.75, మరో రూ.5 ఇతర ఖర్చులుగా చెల్లిస్తారు. ఇలా రోజువారీ వేతనంలో సుమారుగా రూ.134 సిబ్బంది జీతంలో కట్ చేయగా, చివరికి నెలకు సుమారు రూ.12 వేలు వేతనం ఖాతాల్లో జమ చేస్తారు. ఇదంతా 30రోజులు ఉద్యోగానికి హాజరైతేనే లేకుంటే కాంట్రాక్టర్ పేరుతో ఏలూరు జీజీహెచ్‌లో పెత్తనం చెలాయిస్తున్న వ్యక్తులు సిబ్బందిని భయపెట్టి మరీ జీతాల్లో కోతలు వేస్తారు. తాత్కాలిక ఉద్యోగం కావటంతో రెండు, మూడు రోజులు సెలవు పెట్టి మళ్లీ పనికి వస్తానంటే ఇక్కడ కాంట్రాక్టర్ తరఫున పని చేసే వ్యక్తులకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ముట్టజెబితేనే ఉద్యోగం ఉంటుంది. లేకుంటే ఇంటికి వెళ్లిపోవాల్సిందే. పనికి రాకుండా సెలవు పెట్టినా, హాజరు వేస్తారు కానీ ఆ జీతం డబ్బులు మాత్రం అయ్యగారికి సమర్పించుకోవాల్సిందే. ఇలా రెక్కాడితే కానీ డొక్కాడని పేద మహిళలకు సక్రమంగా వేతనాలు చెల్లించే పరిస్థితి కానరావటం లేదని సిబ్బంది వాపోతున్నారు.

వేతనాల చెల్లింపులపై హామీ



జీజీహెచ్ శానిటేషన్ సిబ్బందికి 18 నెలల పీఎఫ్ బకాయిలు, 5 నెలల వేతనాల బకాయిలు ఉండడంతో సమ్మెకు పిలుపునిచ్చాం. ఫస్ట్ ఆబ్జెక్టివ్ అనే సంస్థ శానిటేషన్ కాంట్రాక్ట్‌ను నిర్వహిస్తోంది. ఈ సంస్థ నుంచి వెళ్లిపోయిన పాత డైరెక్టర్ 7 నెలల పీఎఫ్ బకాయిలు చెల్లించామని, డీఎంఈ నుంచి లెటర్ తీసుకొచ్చి డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్‌కు చూపించారు. త్వరలో పీఎఫ్ 7 నెలల బకాయిలు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఇక రెండు నెలల జీతాలు చెల్లింపుకు చర్యలు చేపట్టారు. శానిటేషన్ సిబ్బంది సమస్యలపై నిత్యం పోరాటం చేస్తున్నాం. కార్మికులకు అండగా ఉంటూ పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

– కృష్ణమాచార్యులు, యూనియన్ జిల్లా అధ్యక్షుడు

వాహన చోదకులకు గులాబీలు



వాహన చోదకుడికి హెల్మెట్ పెడుతున్న అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రహదారి భద్రతా నిబంధనలు పాటిస్తున్న వాహన చోదకులకు రవాణా శాఖ అధికారులు గులాబీ పూలు ఇచ్చి అభినందించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం జాతీయ రహదారిపై రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు, సీటు బెల్టు ధరించి కార్లను నడిపే వారికి గులాబి పువ్వులను అందించి ప్రశంసించారు. హెల్మెట్, సీట్ బెల్టు ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రహదారి భద్రతా నియమాల కరపత్రాలను పంచారు. కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారులు జి.స్వామి, వైఎస్‌వీ కల్యాణి, పి.నరేంద్ర బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే పేదలకు మేలు



శ్రీనివాసరావును కలిసిన గంటా సాయి, ఐటీ వింగ్ సత్యదేవ్, సునీల్‌కుమార్, జనార్ధన్

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదలకు మేలు చేశారని, కూటమి ప్రభుత్వంలె పేదల బతుకులకు భరోసా లేకుండా పోయిందని వైఎస్సార్ సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు అన్నారు. ఏలూరు నగర అధ్యక్షుడిగా నియమితులైన ఆయన్ని పలువురు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నేటికీ ఎన్నికల హామీలను అమలు చేయలేని దుస్థితిలో ఉందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఎన్నికల హామీలను 98 శాతం అమలు చేసి చూపించి, రాజకీయాల్లో సరికొత్త చరిత్ర సృష్టించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంటా సాయికుమార్, పిల్లంగోళ్ల సత్యదేవ్, జనార్ధన్, ఉప్పల దుర్గాప్రసాద్, రజనీకాంత్, కొన్నూరు రాము, బండ్లమూడి సునీల్‌కుమార్, కొండపల్లి పరమేశ్వర్, రెల్ల రామకృష్ణ, ఎం.కనకారావు, దాలి వెంకటేష్, మాచర్ల లోకేష్, తులసీవర్మ తదితరులు ఉన్నారు.

ప్రజాగ్రహానికి గురికాక తప్పదు

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జేపీ



జయప్రకాష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వైఎస్సార్ టీయూసీ నాయకులు

ఏలూరు టౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాజకీయాల్లో విలువలు విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచారని, నేటి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడు నెలలకే ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, భవిష్యత్తులో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నగర అధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా నాయకులు జయప్రకాష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ సంపద సృష్టించి ప్రతి సంక్షేమ పథకాన్నీ అమలు చేసి చూపిస్తామంటూ కూటమి నేతలంతా ప్రగల్భాలు పలికారని, తీరా ప్రజలు అధికారం ఇస్తే ఇప్పుడు నిధులు లేవని, పథకాలు అమలు చేయలేకపోతున్నామని చెప్పటం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రజలకిచ్చిన ప్రతి హామీనీ అమలు చేయాలని జేపీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, బీసీ సెల్ నగర అధ్యక్షుడు కిలాడి దుర్గారావు, వైఎస్సార్ టీయూసీ నగర అధ్యక్షుడు వైఎస్‌వీ శివరావు, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడు పాతినవలస రాజేష్, పార్టీ సోషల్ మీడియా అధ్యక్షుడు సుజన్, బూత్ కమిటీ అధ్యక్షుడు ఎచ్చెర్ల ఉమామహేష్, వాణిజ్య విభాగం అధ్యక్షులు ఫిట్టా ధనుంజయ్, పార్టీ నాయకులు ఉన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



సదస్సులో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): మనవ అక్రమ రవాణాను అరికట్టాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ అధికారులతో ఆయన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మానవ అక్రమరవాణా అరికట్టేందుకు ప్రతి ఒక్కరు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. గుర్తించిన బాధితులను చిల్డ్రన్ హోమ్స్ లేదా పునరావాస కేంద్రాల్లో వసతి కల్పిస్తారని తెలిపారు. వారికి ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ప్రాజెక్ట్ డైరెక్టర్, ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ పి.శారద, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సూర్య చక్రవేణి, డీసీఆర్‌బీ ఎస్సై రాజారెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీఎస్‌వీ మునేశ్వరరావు, సీడబ్ల్యూసీ ఇన్‌చార్జి చైర్మన్ పి.వెంకటేశ్వరరావు, ప్యానల్ అడ్వకేట్ కూనా కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

మారని దళితులు, గిరిజనుల జీవితాలు



సమావేశంలో మాట్లాడుతున్న దేవ కుమార్

ఏలూరు (టూటౌన్): స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు దాటినా నేటికీ దళిత, గిరిజనుల్లో ఆర్థిక, సామాజిక మార్పు రాలేదని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ డైరెక్టర్ అల్లాడి దేవకుమార్ అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక లేడీస్ క్లబ్ ఎన్ఆర్‌పేటలో ఏలూరు జిల్లా దళిత గిరిజన బడ్జెట్ వాచ్ సమావేశం శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దేవకుమార్ మాట్లాడుతూ రాబోయే బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ సబ్ ప్లాన్ బడ్జెట్ నిధులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెండం సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు నిర్ణయాధికారాలు ఉంటేనే వారి అభివృద్ధి సాధ్యమైతుందని చెప్పారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దళిత గిరిజన బడ్జెట్ వాచ్ ఏలూరు జిల్లా కన్వీనర్ సింగవరపు జ్యోతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ దళిత గిరిజన బడ్జెట్ కోఆర్డినేటర్ రమణ మూర్తి, ఏలూరు జిల్లా ఎస్సీ బార్ అసోసియేషన్ సెక్రటరీ ఎ. డేనియల్, మేత అజయ్ బాబు, ఎన్ లక్ష్మీకుమారి, వెంకటేశ్వరరావు, వాసే జయపాల్, డీబీఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం





ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు, ముస్తాబైన సభావేదిక

ఏలూరు(మెట్రో): ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను 76వ భారత గణతంత్ర వేడుకలకు సిద్ధమైంది. ఇక్కడ కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉదయం 9 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. పోలీస్ పెరేడ్‌ను పరిశీలించి తిరిగి వేదిక చేరుకొని పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించి గణతంత్ర దినోత్సవ సందేశం ఇస్తారు. వేడుకల్లో జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలు అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలపై రూపొందించిన అలంకృత శకటాలు సిద్ధంగా ఉన్నాయి. గౌరవ అతిథులు, విశిష్ట అతిథులు, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ప్రజలు వేడుకలను తిలకించేందుకు వీలుగా ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. వివిధ ప్రభుత్వ శాఖలచే ఉపకరణాలు పంపిణీ, శాఖలు చేపట్టే కార్యక్రమాలను తెలియజేసేందుకు ఉద్దేశించిన ప్రత్యేక స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేశారు.

ముగిసిన క్రికెట్ మ్యాచ్



విజేతకు షీల్డ్‌ను అందిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): జలతరంగిణి క్రీడోత్సవాల్లో భాగంగా ఇరిగేషన్ సర్కిల్ ఏలూరు టీం, ఎల్ఎంసీ టీం మధ్య శనివారం క్రికెట్ మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎల్ఎంసీ టీం 12 ఓవర్లలో 134 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఏలూరు టీం 78 పరుగులు మాత్రమే చేసింది. రన్ రేట్ ఆధారంగా ఏలూరు జట్టు ఫైనల్‌కి చేరింది. ఈ మ్యాచ్‌లో అత్యధికంగా 33 పరుగులు చేసిన రవి కిషోర్‌ని ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపిక చేసి జలతరంగిణి కన్వీనర్ చోడగిరి శ్రీనివాస్ షీల్డ్‌ని బహూకరించారు. అనంతరం ఫైనల్ మ్యాచ్ ఇరిగేషన్ ఆర్ఎంసీ సర్కిల్ ఏలూరు టీం, ఐసీ విజయవాడ హెచ్‌వోడీ టీం మధ్య జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఏలూరు టీం 12 ఓవర్లలో 114 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన విజయవాడ టీం 115 పరుగులు చేసి జలతరంగిణి జోన్–2 విజేతలుగా నిలిచారు. అత్యధికంగా 44 పరుగులు చేసిన వివేక్‌ని ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపిక చేసి షీల్డ్ బహూకరించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ ఇంజినీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా కృష్ణా ఈస్టర్న్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కొడాలి బాబు విజయవాడ టీంకి కెప్టెన్‌గా వ్యవహరించినట్లు జలతరంగణి కమిటీ తెలిపింది.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలి



వివరాలు అడుగుతున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ది ఏలూరు మున్సిపల్ ఎలిమెంటరీ అండ్ అప్పర్ ప్రైమరీ టీచర్ కోఆపరేటివ్ సొసైటీ నిధులు దుర్వినియోగం చేసిన పాలకవర్గంపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి, ఏలూరు నగర శాఖ ప్రధాన కార్యదర్శి రాజారావు జొన్నకూటి జిల్లా సహకార శాఖ అధికారులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీ మొత్తం స్థిర మూలధనం రూ.ఐదున్నర కోట్లకుపైగా ఉండగా 118 మంది రూ.3.16 కోట్ల రుణాలు తీసుకున్నారని చెప్పారు. వారిలో గత ఐదేళ్లకు పైగా 88 మంది అప్పు కట్టకుండా డిఫాల్టర్స్‌గా ఉన్నారని, వారి నుంచి రూ.2.62 కోట్లు సొసైటీకి బకాయి రావాల్సి ఉందని తెలిపారు. గత ఎనిమిదేళ్ల నుంచి నేటి వరకు మాజీ డైరెక్టర్ బర్ల సత్యనారాయణ మొబైల్ నెంబర్‌కి ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు జమవుతున్నాయని, అయితే కట్టిన రసీదులపై ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ సంతకాలు లేవని వివరించారు. నిధుల దుర్వినియోగంపై గతంలోనే విచారణ చేసి నివేదికను సహకార అధికారులకు అందించినా చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక జిల్లా సహకార అధికారి కార్యాలయంలో ఎమ్మెల్సీ గోపిమూర్తి, యూటీఎఫ్ నాయకులు అధికారులను కలిసి పాలకవర్గంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు



సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న ఎంపీపీ స్కూల్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు అని ఇందిరా కాలనీ ఎంపీపీ స్కూల్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు గుగ్గులోతు కృష్ణ అన్నారు. శనివారం పాఠశాలలో జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. సీనియర్ ఓటర్లు పావాడి రాములమ్మ, పల్లెల నాగరత్నంలను దుస్సాలువా, నూతన వస్త్రాలు, పండ్లతో ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు టి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఓటు హక్కు వినియోగం పౌరుల ప్రాథమిక కర్తవ్యమని స్థానిక సెయింట్ థెరిసా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాల ప్రిన్సిపాల్ పి.మెర్సీ అన్నారు. కళాశాలలో నిర్వహించిన ఓటర్ దినోత్సవంలో ఆమె మాట్లాడారు. విద్యార్థినులు, అధ్యాపకులు ఓటర్ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఓటు విశిష్టతను తెలియజేస్తూ పోస్టర్లను ప్రదర్శించారు. అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల ఎలక్టోరల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఏలూరుకు సహకరిస్తాం



సమావేశంలో పాల్గొన్న కొమ్మారెడ్డి పట్టాభిరామ్

ఏలూరు (టూటౌన్) : ఏలూరు నగరాన్ని స్వచ్ఛ ఏలూరుగా తీర్చిదిద్దేందుకు తన వంతు సహకారం అందిస్తానని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. శనివారం ఏలూరు కార్పొరేషన్ కార్యాలయం మేయర్ చాంబర్లో నిర్వహించిన స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ రివ్యూ మీటింగ్‌కు పట్టాభిరామ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏలూరు కార్పొరేషన్ డంపింగ్ యార్డ్, పోణంగిలో ఉన్న 30 ఎకరాల డంపింగ్ యార్డులోని చెత్తను త్వరితగతిన క్లియర్ చేస్తామన్నారు. నగరంలో వచ్చే చెత్తను ఎరువుగా తయారుచేసి రైతులకు అందిస్తామని చెప్పారు. తంగెళ్లమూడిలో నిర్మించిన 5 ఎంఎల్డి ట్రీట్మెంట్ ప్లాంట్‌ను త్వరలో వినియోగంలో తీసుకొస్తామన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏలూరు నగరాన్ని టాప్ టెన్‌లో నిలబెడతామని చెప్పారు. మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, కమిషనర్ ఏ.భాను ప్రతాప్ మాట్లాడారు. సమావేశంలో మున్సిపల్ ఎంఈ, డీఈ, ఏఈలు, ఏసీపీ, డీమాన్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

డీఈఎల్‌ఈడీ పరీక్ష ఫీజులు చెల్లించండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్‌ఈడీ) 2024 – 25 బ్యాచ్ 1వ సెమిస్టర్, అనుత్తీర్ణులైన అభ్యర్థులకు (2023–25, 2022–24 బ్యాచ్‌లకు మాత్రమే) పరీక్ష ఫీజు చెల్లించడానికి గడువు తేదీలు విడుదలయ్యాయని డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మ తెలిపారు. అపరాధ రుసుము లేకుండా ఈ నెల 31 వరకు, రూ.50 అపరాధ రుసుంతో ఫిబ్రవరి 4 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి బీఎస్ఈ ఏపీ వెబ్‌సైట్ ఈ నెల 27 నుంచి అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు.

క్రికెట్ టోర్నీ లోగో ఆవిష్కరణ

ఏలూరు (టూటౌన్): స్నేహాంజలి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్ 12 లోగోను ఎమ్మెల్యే బడేటి చంటి శనివారం ఆవిష్కరించారు. గత 12 ఏళ్లుగా వివిధ కారణాలతో మరణించిన మిత్రుల జ్ఞాపకార్థం స్నేహాంజలి ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి నెలలో స్నేహాంజలి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్టు స్నేహాంజలి ఫ్రెండ్స్ తెలిపారు. స్నేహాంజలి ఫ్రెండ్స్, ఉల్లింగల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో త్రిస్థాహ బ్రహ్మోత్సవాల ముగింపును పురస్కరించుకుని శనివారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటుచేశారు. సుమారు 3 వేల మంది భక్తులు ప్రసాదం స్వీకరించారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ చేశారు.